క్లుప్తంగా

ద్వారకాతిరుమల మండలంలో 144 సెక్షన్

ద్వారకాతిరుమల: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడి అరెస్టు కారణంగా సానుభూతిపరులు చేస్తున్న నిరసన కార్యక్రమాల నేపథ్యంలో ఎటువంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా మండల రెవెన్యూ పరిధిలో ఈనెల 16 వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. కావున నలుగురు కంటే ఎక్కువ మంది గుమ్మికూడి ఉండరాదని, అలాగే ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించే వారు ముందుస్తుగా అధికారుల నుంచి అనుమతులు పొందాలని ఆయన సూచించారు.

సీతారామస్వామి ఆలయంలో శాంతి కల్యాణం



గుండుగొలనులో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చక బృందం

భీమడోలు: గుండుగొలనులో దేవదాయ ధర్మశాఖ పరిధిలోని ప్రసిద్ధి గాంచిన పురాతన సీతారామస్వామి ఆలయంలో ఆదివారం శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్ కుమార్ పర్యవేక్షణలో యాజ్ఞిక స్వామి దివి గోపాలాచార్యులు, ఆలయ అర్చక స్వామి సాయి సుధీరాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయంలోని ధ్రువ మూర్తులకు అభిషేకాలు, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జూనియర్ గృహసమితి సభ్యుల ర్యాలీ

దెందులూరు: యువత చిన్ననాటి నుంచి దేవుని ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగాలని, నిరంతర ప్రార్థనలతో జీవించాలని సాల్వేషన్ ఆర్మీ కో ఆఫీసర్ మేజర్ సువర్ణభాయి ఆదివారం అన్నారు. దెందులూరులో క్రైస్తవ గీతాలాపలనతో జూనియర్ గృహ సమితి సభ్యులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏలూరులో నిర్వహించనున్న జూనియర్ గృహసమితి ర్యాలీకి వారు తరలివెళ్లారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోవాలి



అర్ధవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సంతోష్

గణపవరం: గ్రామాల్లో ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి వైద్య సేవలు అందించడం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. గణపవరం మండలం అర్ధవరంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో 35 ఏళ్లు నిండిన అందరూ ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులు, బీపీ, సుగర్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు కోరారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయం నందు భవన నిర్మాణ కార్మికకుల సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ, తమిళనాడు, కేరళలో అమలు జరుగుతున్న చట్టాలను చేయాలని, నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పరసా శ్రీను, రెడ్డి లక్ష్మణరావు, ఎం.గోపాలకృష్ణ, పరసా రాజేష్, చీర అప్పారావు, షేక్ మస్తాన్, సీహెచ్ భాస్కరరావు, కటిక రెడ్డి శ్రీనివాస్, షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ సొసైటీ భవనం ప్రారంభం

కొయ్యలగూడెం: అంకాలగూడెంలో నాబార్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ ఉమాభోగలింగేశ్వర ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కోఆపరేటివ్ సొసైటీ నూతన భవనాన్ని ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ లక్ష్మణ్ ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సభ్యత్వాన్ని స్వీకరించారు. బోడిగూడెం సర్పంచ్ గడ్డియ్య సొసైటీ చైర్మన్ ఎస్ఆర్ఆర్ నరసింహరాజు, వైస్ చైర్మన్ గోపాలకృష్ణ గోఖలే, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉత్సవాలకు గణేష్ ప్రతిమలు సిద్ధం



జంగారెడ్డిగూడెం జేపీ సెంటర్‌లో అమ్మకానికి సిద్ధంగా గణనాథుని ప్రతిమలు



చింతలపూడిలో ఉత్సవాలకు సిద్ధంగా ఉన్న గణేష్ విగ్రహాలు

జంగారెడ్డిగూడెం: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలు సిద్ధమయ్యాయి. వివిధ ఆకృతులలో బొజ్జగణపయ్య విగ్రహాలు అందుబాటులోకి వచ్చాయి. ఉత్సవ కమిటీల అభిరుచులకు అనుగుణంగా గణేష్ ప్రతిమలను రూపకర్తలు తయారుచేశారు. ఆయా విగ్రహాల కూర్పు, సైజును బట్టి ఒకొక్క విగ్రహానికి ఒకొక్క రేటును విక్రయదారులు నిర్ణయించారు. ఈ నెల 18 నుంచి గణపతి నవరాత్రులు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్థానిక జేపీ సెంటర్‌లో వివిధ ఆకృతుల్లో ఉన్న గణనాథుల విగ్రహాలను అమ్మకానికి సిద్ధం చేశారు. మూషిక వాహన బాల గణేషుడు, నంది వాహనంపై గణేషుడు, తలపాగా చుట్టుకున్న గణేషుడు.. ఇలా అనేక రూపాల్లో వినాయక విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

చింతలపూడిలో ఉత్సవాలకు సిద్ధం

చింతలపూడి : గణేష్ నవరాత్రి ఉత్సవాలకు వినాయక విగ్రహాలు ముస్తాబయ్యాయి. ఈ నెల 19 నుంచి మండలంలో గ్రామగ్రామాన ప్రారంభమయ్యే గణపతి ఉత్సవాలకు గణేష్ ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఉత్సవాలకు అవసరమైన వినాయకుడి విగ్రహాలను హైదరాబాద్, సూర్యాపేట, విజయవాడ పట్టణాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకున్నారు. వివిధ ఆకృతుల్లో ఉన్న గణేష్ విగ్రహాలను వ్యాపారులు సిద్ధం చేశారు. గత 15 సంవత్సరాలుగా గణేష్ విగ్రహాలను ఇక్కడి వ్యాపారులు తీసుకువచ్చి చింతలపూడి చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. విగ్రహం సైజును బట్టి రూ.1,500 నుంచి 15 వేల వరకు విక్రయిస్తున్నారు ఇదిలా ఉండగా ఏటా వినాయక విగ్రహాలను స్థానిక పెద్ద చెరువు, నాగిరెడ్డిగూడెం సమీపంలో ఉన్న తమ్మిలేరు ప్రాజెక్టులో నిమజ్జనం చేస్తున్నారు. ఎప్పటి కప్పుడు ప్రాజెక్టు అధికారులు ఈ విగ్రహాలను తొలగించకపోతే ప్రాజెక్టు నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా నిమజ్జన సమయంలో అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రమాదాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తలపాగా చుట్టుకున్న బొజ్జగణపయ్య



మూషిక వాహన బాల గణేషుడు



నంది వాహనంపై విఘ్నేశ్వరుడు

మట్టి విగ్రహాలు సరఫరా చేయాలి



గణేష్ నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని మట్టి విగ్రహాలను భక్తులు వినియోగించాలి. దీనివల్ల విగ్రహాలను నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితం కావు. పర్యావరణ సమస్య తలెత్తదు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మట్టి విగ్రహాలను భక్తులకు సరఫరా చేయాలి.

– ఎస్‌కే అజాద్ బాబు, అజీమ్ ఛారిటీ ఫౌండేషన్ చైర్మన్

జాగ్రత్తలు తీసుకుంటాం



వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. నియోజకవర్గంలోని ఉత్సవ కమిటీల నిర్వాహకులు కూడా పోలీస్ వారి నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని విగ్రహాలను నిమజ్జనం చేయాలి.

– ఎంటీఎస్ మల్లేశ్వరరావు, సీఐ, చింతలపూడి

నూతన వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత



నూతన వలంటీర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రజాసేవే లక్ష్యంగా వలంటీర్లు తమ విధులను నిర్వర్తించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని సత్తెన్నగూడెంలో ఇటీవల తొలగించిన వలంటీర్ల స్థానంలో, మరో 5 గురు వలంటీర్లను కొత్తగా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నూతన వలంటీర్లు మానుకొండ ప్రసన్నకుమార్, కుమ్మరి అనురాధ, తాడేపల్లి అశ్విని, తోరం మమత, తానిగడప నాగమణి లకు ఆదివారం నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు ఉన్నారు.

శ్రీవారి పథకాలకు రూ.2 లక్షల విరాళం



దాత సుబ్బారావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణ స్వామి



దాత హరీష్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ జగన్

ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు ముగ్గురు భక్తులు ఆదివారం వేరువేరుగా రూ. 2,00,787 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన ఎల్‌వీ సుబ్బారావు నిత్యాన్నదాన పథకానికి రూ. 50,116, అలాగే ఎస్.ఉమాసాయి గోసంరక్షణ పథకానికి రూ. 50,116 అందించగా, దాతలకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణ స్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే నిడదవోలుకు చెందిన ఘంటా వెంకట హరీష్ నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,555 అన్నదాన కార్యాలయంలో జమ చేయగా, సీనియర్ అసిస్టెంట్ జగన్ దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

ఏఎంసీ పదవీ కాలం పొడిగింపు

- 2024 ఫిబ్రవరి 2 వరకూ పొడిగించిన ప్రభుత్వం
- ఏఎంసీ సభ్యులకు ఉత్తర్వులు అందజేసిన ఆళ్ల నాని



ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్లనాని

ఏలూరు టౌన్: ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) అభివృద్ధికి కృషి చేయాలని, రైతన్నలకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని చెప్పారు. ఏలూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ కమిటీ 2024 ఫిబ్రవరి 2 వరకూ గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా వాటిని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని అందజేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, డైరెక్టర్లకు ఉత్తర్వులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ళనాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా రైతన్నలకు మేలు చేయాలనే సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రైతులకు ఏఎంసీ నిత్యం అండగా నిలబడుతూ వారిలో భరోసా నింపాలని సూచించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్లు మేతర సురేష్, సాసుపల్లి యుగంధరప్రసాద్, జక్కుల బెనర్జీ, మహ్మద్ ఖాజా, ఉయ్యాల వెంకటరమణ, మట్టా ధనలక్ష్మి, కాళిదాసు దుర్గ, చలమోలు నాగమల్లేశ్వరి, ముదుండి భవానీ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

భీమడోలు: గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1975–76 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిసి సందడి చేశారు. ఇక్కడ చదువుకుని నాలుగు దశాబ్దాలకు పైగా గడిచిన వారంతా కుటుంబ సమేతంగా చేరుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దేశ, విదేశాల్లో, వివిధ వృత్తి, వ్యాపారాల్లో స్థిరపడినప్పటికీ వారంతా తమ బాల్య స్నేహితులను కలిసేందుకు ఎంతో ఆతృతతో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి సత్కరించారు. తమ స్నేహితులను కలవాలన్న చిరకాల వాంఛ నెరవేరడంతో అప్యాయంగా పలకరించుకుంటూ వారంతా ఆనందంలో మునిగి తేలారు. 47 ఏళ్ల క్రితం ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులంతా తమ మనుమలు, మనవరాళ్లకు పాఠశాల పరిసరాలను చూపి మురిసిపోయారు. గురువులు లక్ష్మీపతి అప్పారావు, కొండూరి గురుమూర్తిని ఘనంగా సత్కరించారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి మామిళ్లపల్లి రమణమూర్తి ఆర్థిక సాయంతో డైనింగ్ హాల్‌ను నిర్మించారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం సమయంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా తమ వంతు కృషి చేసామని వారన్నారు. దాతను పూర్వ విద్యార్థుల బృందం అభినందించింది. అనంతరం వారంతా సహపంక్తి భోజనం చేసారు.

ఇన్నాళ్లకు చంద్రబాబు పాపం పండింది



వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వాసు

ద్వారకాతిరుమల: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి పాపం ఇన్నాళ్లకు పండిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాబుకు కోర్టు రిమాండ్ విధించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాధనాన్ని దోచేసినట్టు పక్కా ఆధారాలున్నా తప్పించుకునేందుకు బాబు చివరి క్షణం వరకు ప్రయత్నించారని అన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు బాబు అండ్ బ్యాచ్ తమ ప్రభుత్వంపై బురదచిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అరెస్టుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆయనపై కక్ష సాధింపు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇప్పటికే ఆయన వివిధ నేరారోపణలకు సంబంధించి 18 స్టేలు తెచ్చుకుని బయట తిరుగుతూ, శ్రీరంగ నీతులు చెబుతున్నాడని విమర్శించారు. తప్పు చేసిన వారు ఎప్పటికీ తప్పించుకోలేరని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో లోకేశ్ కూడా అరెస్టు అవ్వాలని అన్నారు. చంద్రబాబు ఇప్పటి వరకు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చారని, ఇకపై ఆ ఆటలు సాగవన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి



నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో అపుస్మా సభ్యుల సమావేశం

ఉంగుటూరు: ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు అందజేయాలని పశ్చిమగోదవరి జిల్లా అపుస్మా సమావేశంలో సభ్యులు కోరారు. ఆదివారం ఉంగుటూరు మండలం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో ఏలూరు జిల్లా అపుస్మా సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా సంఘ అధ్యక్షుడు గుణ్ణం బుల్లబ్బాయి అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలకు అనుమతులు మూడేళ్ల నుంచి 8 ఏళ్ల వరకు కాలపరిమితిని పెంచినట్టు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే 94 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. సమావేశంలో డీఈవో శ్యామ్‌సుందర్, అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తులసీ విష్ణుప్రసాదు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూరుగుపల్లి గోపాలకృష్ణ, జిల్లా కోశాధికారి రవిశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా సెక్రటరీ ఎం శివకుమార్ పాల్గొన్నారు.

కర్మఫలం అనుభవించక తప్పదు

- ప్రతిపక్ష నేత చంద్రబాబు అవినీతి డొంక కదలింది
- రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్: పలుకుబడి, అధికార దర్పంతో చేసిన పాపాలు ఊరికే వదిలిపెట్టవనీ, కర్మ ఫలం ఎవరైనా అనుభవించాల్సిందేనని.. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు పాపం పండిందని.. శిక్ష తప్పదని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి అన్నారు. ఏలూరులో ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నేను నిప్పును అంటూ చంద్రబాబు నిత్యం గొప్పలు చెప్పుకునేవాడనీ, నేడు అదే నిప్పుకు తుప్పు పట్టిందని ఎద్దేవా చేశారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు దొరికిపోయారని తెలిపారు. చంద్రబాబుకు న్యాయస్థానం జ్యుడీషియరీ రిమాండ్ విధించటం ద్వారా న్యాయవ్యవస్థపై మరింత విశ్వాసం పెరిగిందన్నారు. వ్యవస్థలను వినియోగిస్తూ తెలుగు రాష్ట్రాల్లో అరాచకాలు, కుట్రలు, కుటిల రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన చంద్రబాబుకు సీఐడీ అధికారులు చెక్ పెట్టారని తెలిపారు. కేంద్ర జీఎస్‌టీ దర్యాప్తుతో వెలుగులోకి వచ్చిన చంద్రబాబు అక్రమాలను రాష్ట్ర సీఐడీ అధికారులు లోతైన దర్యాప్తు చేసి, నిజాలను వెలికితీశారని చెప్పారు. షెల్ కంపెనీలతో ప్రజా ధనాన్ని దోచేసిన చంద్రబాబు అక్రమంగా తన సొంత కంపెనీల్లోకి తరలించారనే విషయం ప్రజలు గుర్తించాలని అన్నారు. రూ.371 కోట్ల ప్రజాధనాన్ని అక్రమంగా లూటీ చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా ? అని ప్రశ్నించారు. ఇవే కాదనీ ఇంకా అమరావతిలో సీఆర్‌డీఏ స్కామ్, ఏపీ ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్డు వంటి అనేక అవినీతి, అక్రమాలు త్వరలోనే బహిర్గతం కానున్నాయని చెప్పారు. టీడీపీ నాయకుడు లోకేశ్ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారనీ ఆయన మంత్రిగా ఎంత అవినీతి చేశారో సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల సొమ్మును దోచుకున్నారని తెలిపారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ మరణించిన అనంతరం చంద్రబాబు, కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కై ఆనాడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎంత దారుణంగా అక్రమ కేసులు పెట్టి వేధించారో ప్రజలు మర్చి పోలేదన్నారు. దివంగత వైఎస్సార్ కుటుంబాన్ని వేధించి శునకానందం పొందారనీ, సీఎం జగనన్నను ఒంటరిని చేసి కుట్రలతో అత్యంత దారుణంగా వేధించిన పాపానికి దేవుడు తగిన శిక్ష వేస్తాడని, కర్మ ఎవరినీ వదిలిపెట్టదన్నారు. చంద్రబాబు న్యాయస్థానంలో తన నిజాయితీ చూపించుకోవాలి తప్ప ఆరోపణలు చేయటం సరికాదన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు వత్తాసు పలకటం మానుకోవాలనీ, స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తేనే ప్రజలు హర్షిస్తారని హితవు పలికారు. తెలుగు ప్రజల ఆరాధ్య నాయకులు ఎన్టీఆర్‌ను మానసిక క్షోభకు గురిచేసి, బలవంతంగా పార్టీని, పదవిని లాక్కొని ఆయన మరణానికి కారణమైన చంద్రబాబుకు ఆపాపం వెన్నాడుతుందన్నారు.

నగరంలో ఉచిత వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలో ఎస్‌వీఎస్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కన్నెగొల్ల రాఘవ కుమార్ మానేపల్లి రామారావు పర్యవేక్షణలో 292 మందికి మ్యాన్ కైండ్ ఫార్మ సంస్థ సహకారంతో బీఎండీ స్కాన్ ద్వారా ఎముకలు, యూరోపతి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఎస్వీఎస్ హాస్పిటల్ డాక్టర్ కే.కార్తీక్ 145 మందికి షుగరు, కిడ్నీ పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే డాక్టర్ కె.మానస 18 ఏళ్లలోపు పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. రెటీనా వైద్య నిపులు డాక్టర్ కె.అనుదీప్ 126 మందికి కంప్యూటర్‌పై కంటి పరీక్షలు నిర్వహించారు. 24 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. శిబిరంలో మ్యాన్ కైండ్ ఫార్మా మేనేజర్ వి.శ్రీరాములు బృందం మందులు పంపిణీ చేశారు.

15న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరో ఏడు రాష్ట్రాల్లో అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కస్టమర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న విజయవాడ జింఖానా గ్రౌండ్లో సామూహిక దీక్షలు నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కస్టమర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు యర్రా వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్ నందు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో దీక్షలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అగ్రిగోల్డ్ బాధితులు ఆర్థిక ఇబ్బందులతో వందలాదిమంది ఆత్మహత్యలు, అనారోగ్యాలతో చనిపోయారని వాళ్ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.10 లక్షల సహాయం తక్షణమే చేయాలని కోరారు.

జాతీయ పోటీలకు సచివాలయ ఉద్యోగిని ఎంపిక



వలపుల సౌజన్య

పెదవేగి : పెదవేగి మండలం విజయరాయి సచివాలయంలో గ్రేడ్ 5 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వలపుల సౌజన్య జాతీయ సివిల్ సర్వీస్ ఉద్యోగుల బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా అధికారులు ఆదివారం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ సౌజన్య ఇటు విధుల్లోనూ, క్రీడల్లోనూ అంకితభావంతో ఉండేవారన్నారు. మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

సాగర్‌బాబుకు సన్మానం



పొంగుటూరులో సాగర్‌బాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం: పొంగుటూరు పంచాయతీ కన్నాయిగూడెం గ్రామవాసి యాళ్ళ సాగర్‌బాబు సహాయ కమిషనర్‌గా ఉద్యోగం సాధించిన నేపథ్యంలో సర్పంచ్ పసుపులేటి రాంబాబు ఆధ్వర్యంలో, సీపీఐ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. కేవీపీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టిన సాగర్ బాబు పట్టుదలతో చదివి ఇండియా రెవెన్యూ సర్వీసెస్‌ను సాధించడం ఈ ప్రాంతవాసులకు గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కన్నాయిగూడెం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, యూత్ సభ్యులు, నూతలపాటి జయరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పోడూరు: నేటి సమాజంలో అందరూ ఒత్తిడితో కూడిన జీవితాన్ని ఎదుర్కొంటున్నారనీ, దీనివల్ల చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయనీ, కాబట్టి ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) పాస్ట్ జోనల్ ప్రెసిడెంట్ రాహుల్ వేదాంతం పిలుపునిచ్చారు. జేసీఐ పాలకొల్లు రైసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం జిన్నూరు ఐడియల్ స్కూల్ ప్రాంగణంలో మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాస్ట్ జోనల్ ప్రెసిడెంట్ రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద, సామాన్య ప్రజలకు తగిన వైద్యసేవలు అందించే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మెగా శిబిరంలో ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, దంత, చర్మ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసి ఆరోగ్య సూచనలు చెప్పారు. రోగులకు దంత వైద్య నిపుణురాలు డాక్టర్ మౌని కావలి, హెడ్ అండ్ నెక్ జర్జన్ డాక్టర్ జయదుర్గాదేవి రుద్రరాజు, ప్రసూతి వైద్యనిపుణురాలు డాక్టర్ ఉమాదేవి కావలి, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ సుభాషిణి పాల్గొన్నారు.